సాక్షి మహబూబ్‌నగర్

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



మన్యంకొండ జనసంద్రం

శ్రావణ శనివారం సందర్భంగా మన్యంకొండ భక్తులతో కిటకిటలాడింది.

వివరాలు 8లో ▸



జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

జూరాల ప్రాజెక్టుకు 3 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.7 /22.1

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

15 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న కారుణ్య నియామకాల కింద 15 మంది అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చారు. శనివారం కలెక్టర్ రవినాయక్ తన చాంబర్‌లో వీరికి జూనియర్ అసిస్టెంట్‌గా పోస్టింగ్‌లిచ్చి.. అందుకు సంబంధించిన ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. క్రమశిక్షణగా పని చేసుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. పనుల కోసం వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుండాలన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు, ఏఓ శంకర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

బ్యాటరీ టెండర్లకు ఆహ్వానం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలోని 17 తహసీల్దార్ల కార్యాలయాలకు బ్యాటరీలు, యూపీఎస్ సరఫరాలకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్‌కు ఈ నెల 22తేదీ సాయంత్రం 5 గంటల లోగా టెండర్లను సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. ఇతర వివరాల కోసం హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై కొనసాగుతున్న సర్వే



పాలమూరు: జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల కట్టడి కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా 20మంది బ్రీడింగ్ చెక్కర్స్‌తో పాటు 855 మంది ఆశలతో ఈ నెల 1 నుంచి జిల్లాలో ఇంటింటి సర్వే చేపడుతున్నారు. 19 రోజుల్లో బ్రీడింగ్ చెక్కర్స్ 48,942 ఇళ్ల తనిఖీ చేశారు. ఒక్కో ఆశ కార్యకర్తకు ప్రతి రోజు 30 ఇళ్ల తనిఖీ చేసే విధంగా లక్ష్యం కేటాయించగా ఇప్పటి వరకు అందరూ కలిపి 1,25,927 మంది సర్వే పూర్తి చేశారు. ఆశలు, బ్రీడింగ్ చెక్కర్స్ ఇంటి తనిఖీలకు వెళ్లిన క్రమంలో యాంటీ లార్వా ఆపరేషన్‌లో భాగంగా ఇంట్లోని పరిసరాలు, బయట పరిసరాలు పరిశీలించాలి. ఇంట్లో ఉండే హౌజ్‌లు, కూలర్లు, పూలకుండీలు, నీటి సంపులు నీటి నిల్వ ఉండే వస్తువులు, పరిసరాలు పరిశీలించి వాటిని తొలగించాలి. నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు పెరుగుతాయని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 66 డెంగీ పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి.

శరవేగంగా కసరత్తు

ఒక పంపుతో 'పాలమూరు' ప్రారంభించేందుకు ఏర్పాట్లు



ఎల్లూరు పంప్‌హౌజ్ నుంచి నార్లాపూర్ రిజర్వాయర్‌లోని నీటిని ఎత్తిపోసేందుకు కొనసాగుతున్న డెలివరీ సిస్టమ్ పనులు

- త్వరలో ఎత్తిపోతలు చేపట్టేందుకు చర్యలు
- ఎల్లూరు పంప్‌హౌజ్ వద్ద వేగంగా సాగుతున్న పనులు
- వచ్చే నెలలో నీటిపంపింగ్ చేపట్టే అవకాశం
- మోటార్ల బిగింపు ప్రక్రియ పూర్తి

దక్షిణ తెలంగాణలో పలు జిల్లాలకు సాగు, తాగునీరు అందించాలనే ఉద్దేశంతో పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టగా.. తాజాగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే టన్నెల్.. పంప్‌హౌజ్‌లో సివిల్ వర్క్స్.. మోటార్ల బిగింపు పనులు పూర్తయ్యాయి. విద్యుత్ సరఫరా.. మెకానికల్.. డెలివరీ సిస్టమ్ వద్ద పనులు కొనసాగుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో ఎన్నికలకు ముందే ప్రాజెక్టును ప్రారంభించి, నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తుండగా.. ఈ మేరకు కొల్లాపూర్ నియోజకవర్గం ఎల్లూరు సమీపంలోని కోతిగుండు వద్ద నుంచి కృష్ణానది నీటిని ఎత్తిపోసేలా పనులు శరవేగంగా సాగుతున్నాయి.

కొల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ పెద్దల ఆదేశానుసారం ఎల్లూరు పంప్‌హౌజ్ వద్ద పనుల్లో వేగం పెంచారు. ఎల్లూరు సమీపంలోని కోతిగుండు వద్ద నుంచి నీటిని ఎత్తిపోసేందుకు, ఎత్తిపోసే నీటిని నిల్వ చేసేందుకు ఐదు రిజర్వాయర్లను నిర్మించారు. ప్రస్తుతం ఎల్లూరు పంప్‌హౌజ్ వద్ద పనులు వేగంగా సాగుతున్నాయి. హెడ్ రెగ్యులేటరీకి షెట్టర్లు బిగించారు. నీటిని పంప్‌హౌజ్‌లోకి తరలించేందుకు వీలుగా గేట్‌వాల్వ్‌లను ఏర్పాటుచేశారు. టన్నెల్, పంప్‌హౌజ్‌లో సివిల్ వర్క్స్ పూర్తయ్యాయి. మెకానికల్ వర్క్స్ కొనసాగుతున్నాయి. మోటార్ల బిగింపు పనులు దాదాపుగా పూర్తి దశకు చేరుకున్నాయి. డెలివరీ సిస్టమ్ వద్ద పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి మూడు సిస్టమ్ పనులు పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

కొనసాగుతున్న విద్యుత్ సరఫరా పనులు

ప్రాజెక్టు వద్ద విభాగాల వారీగా పనులు నిర్వహిస్తున్నారు. పంప్‌హౌజ్ పనులు, డెలివరీ సిస్టమ్ పనులతో పాటు, విద్యుత్ సరఫరా పనులు వేర్వేరుగా సాగుతున్నాయి. అయితే విద్యుత్ సరఫరా అంశంలో ప్రభుత్వం ఆశించిన రీతిలో పనులు సాగడం లేదనే ప్రచారం జరుగుతోంది. రెండు పంపు మోటార్లకు సంబంధించిన విద్యుత్ ప్యానల్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఒక్కో మోటారు నడిచేందుకు 145 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. ప్యానల్ బోర్డులను ఇటీవల విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ప్రారంభించారు. చార్జింగ్ ప్రక్రియను చేపట్టారు. తాత్కాలికంగా కేఎల్ఐ ప్రాజెక్టుకు సంబంధించిన సబ్‌స్టేషన్‌ను నుంచి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. పాలమూరు ప్రాజెక్టుకు సంబంధించిన విద్యుత్ సరఫరా పనులు ఆలస్యమైతే



విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు పనులు

కేఎల్ఐ సబ్‌స్టేషన్ నుంచి కొన్ని రోజుల పాటు విద్యుత్‌ను అందించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

జూన్‌లోనే ప్రారంభించాల్సి ఉన్నా..

పాలమూరు ప్రాజెక్టు ద్వారా నీటి ఎత్తిపోతల ట్రయల్స్‌ను జూన్ నెలాఖరులోనే చేపట్టాలని, జూలైలో సీఎం చేతుల మీదుగా ప్రాజెక్టు ప్రారంభం చేయించాలని అధికారులు అనుకున్నారు. అయితే విద్యుత్ సరఫరా పనులు ఆలస్యం కావడంతో సెప్టెంబర్‌లో ప్రాజెక్టును ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికలకు ముందే ప్రాజెక్టును ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ అంశాన్ని ఇటీవల ప్రాజెక్టు పర్యటనకు వచ్చిన మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు.

రెండు మోటార్ల బిగింపు

ఎల్లూరు పంప్‌హౌజ్‌లో మొత్తం 9 మోటార్లు ఏర్పాటు చేసేలా పనులు చేపట్టారు. అయితే కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే పాలమూరు ప్రాజెక్టు ద్వారా నీటి ఎత్తిపోతలు చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో ప్రస్తుతం రెండు మోటార్లు మాత్రమే బిగిస్తున్నారు. వీటిలో ఒక మోటారు ద్వారా రోజువారీగా పంపింగ్ చేపట్టే విధంగా పనులు సాగుతున్నాయి. సుప్రీంకోర్టు సూచనల మేరకు తాగునీటి అవసరాలకు 7.02 టీఎంసీల నీటిని ఎత్తిపోయనున్నారు. ఒక్క మోటారు ద్వారా రోజూ 3వేల క్యూసెక్కుల చొప్పున నీటిని ఎత్తిపోస్తారు. నాలుగు రోజులు ఒక పంపును ఆపకుండా నడిపిస్తే ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసుకోవచ్చు.



నార్లాపూర్ రిజర్వాయర్

త్వరలోనే ఎత్తిపోతలు చేపడతాం

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా త్వరలోనే నీటి ఎత్తిపోతలు చేపడతాం. రెండు, మూడు వారాల్లో పనులు పూర్తి అవుతాయి. ఒక్క పంపు మోటారు ద్వారా ఎత్తిపోతలు సాగుతాయి. నార్లాపూర్ రిజర్వాయర్‌ను నింపుతాం. అక్కడి నుంచి తాగునీటి అవసరాల కోసం మిషన్‌భగీరథ స్కీంకు నీటిని తరలిస్తాం. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేశాం.

– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటి పారుదలశాఖ

ప్రాజెక్టు వివరాలిలా..	ఇందుకు అవసరమయ్యే విద్యుత్ 145 మెగావాట్లు	
ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న మోటార్లు : 2	రోజూ ఎత్తిపోసే నీరు	తాగునీటి అవసరాలు
నీటి పంపింగ్ చేపట్టేది : 1 మోటారుతో	3,000 క్యూసెక్కులు	తీరే మండలాలు : 70

ఈ ఏడాది అనుకూలంగా తీర్పులు..

కోర్టులు, ట్రిబ్యునల్ కేసుల కారణంగా పాలమూరు ప్రాజెక్టు పనులకు గతంలో పలు అవాంతరాలు ఏర్పడ్డాయి. అయితే ఈ ఏడాది ప్రాజెక్టుకు అనుకూలంగా రెండు తీర్పులు వెలువడ్డాయి. ఫిబ్రవరిలో పాలమూరు ప్రాజెక్టు ద్వారా తాగునీటి అవసరాలకు కృష్ణానది నీటిని ఎత్తిపోయవచ్చని, 7.02 టీఎంసీల నీటి వినియోగానికి సుప్రీంకోర్టు అనుమతులు ఇచ్చింది. ఇటీవల ప్రాజెక్టు నిర్మాణాలకు ఎటువంటి అభ్యంతరాలు లేవని గ్రీన్ ట్రిబ్యునల్ కూడా తీర్పునిచ్చింది. దీంతో భవిష్యత్‌లో సాగునీటి అవసరాలకు కూడా నీటిని ఎత్తిపోసుకునేందుకు అనుమతులు లభించే అవకాశం ఉంది.



జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ర్యాలీగా వస్తున్న నాయకులు, కార్యకర్తలు

ప్రజల దీవెనలతో అధికారం

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం
- టీపీసీసీ ప్రచార కమిటీ కో–చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- పాలమూరులో తిరగబడుదాం – తరిమికొడుదాం కార్యక్రమం

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజల దీవెనలతో రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని టీపీసీసీ ప్రచార కమిటీ కో–చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తిరగబడుదాం–తరిమికొడుదాం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ టీపీసీసీ చేపట్టిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలో అనూహ్య స్పందన వస్తుందన్నారు. ఈనెల 21 నుంచి సెప్టెంబర్ 15 వరకు ప్రతి గ్రామంలో కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. 2014, 2018 మేనిఫెస్టోల్లో పెట్టి అమలు చేయని కార్యక్రమాలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫెవికాల్ బంధాన్ని ప్రజలకు వద్దకు తీసుకువెళ్లాలని కోరారు. సెప్టెంబర్ చివరి లేదా అక్టోబర్ మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందన్నారు. మనకు ఉన్నది కేవలం 75 రోజులేనని, పార్టీ విజయం కోసం ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చి సోనియా గాంధీకి బహుమతిగా ఇద్దామన్నారు. ప్రతి నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని, మనం అధికారంలోకి రాగానే ఒక్క జీఓతో కేసులు రద్దు చేస్తామని తెలిపారు. చిన్నపాటి విభేదాలను సరిచేసుకొన్ని పార్టీ గెలుపు కోసం కష్టపడాలని కోరారు.



నినాదాలు చేస్తున్న నాయకులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సంపత్‌కుమార్, చిన్నారెడ్డి, శివసేనారెడ్డి, సరిత, ఎర్రశేఖర్, ఒబేదుల్లా కొత్వాల్, మధుసూదన్‌రెడ్డి తదితరులు

■ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేసిన బీఆర్ఎస్ నాయకులను యువత ఎక్కడికక్కడే నిలదీయాలని కోరారు. ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ పెరిగిందన్నారు. ఐక్యమత్యంతో ఉండి ఉమ్మడి జిల్లాలోని 14 స్థానాల్లో అధిక స్థానాలు గెలుచుకుంటే రేవంత్‌రెడ్డి సీఎం అవుతారని తెలిపారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యమకారులపై, నిజాయితీగా ఉండేవారిపై దుర్మార్గంగా, అమానుషంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఇంటికి వెళ్లి ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తే వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని తెలిపారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. మాజీ ఎంపీ మల్లురవి మాట్లాడుతూ ప్రభుత్వ తప్పిదాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని కోరారు. ఈనెల 26న చేవెళ్లలో జరిగిన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు ప్రసంగించారు. అంతకు ముందు బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీసీసీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, ఆయా జిల్లాల అధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ, రాజేంద్రప్రసాద్, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, శ్రీహరి, నాయకులు పిడమర్తి రవి, శివకుమార్‌రెడ్డి, కొండా ప్రశాంత్ రెడ్డి, బెనహర్, వసంత, జహీర్ అక్తర్, సాయిబాబా, లింగంనాయక్, బాల్‌చందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సవరింపులు.. తొలగింపులు!

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆస్తి పన్నుకు సంబంధించి అసెస్‌మెంట్లలో సవరింపులు, తొలగింపులకు అధికారులు శ్రీకారం చుట్టారు. కొన్నేళ్లుగా మహబూబ్‌నగర్ పట్టణంలో గృహ, వాణిజ్య సముదాయాల నిర్మాణం జోరుగా సాగుతోంది. కొందరు పాత ఇళ్లను తొలగించి పునర్మించుకుంటున్నారు. గతంలో కొందరికి రేకులషెడ్లు, పెంకుటిళ్లు ఉండగా ఇటీవల ఆర్‌సీసీతో పక్కాగా పిల్లర్లతో అధునాతనంగా నిర్మించుకుంటున్నారు. మరికొందరు అపార్ట్‌మెంట్లతో పాటు ముఖ్య కూడళ్లలో వాణిజ్య భవన సముదాయాలుగా మారుస్తున్నారు. ఈ క్రమంలోనే ఆస్తి పన్నులో మార్పులు, చేర్పులు చోటు చేసుకుంటున్నాయి. కొన్నిచోట్ల ఒకే యజమాని పాత, కొత్త ఇంటి నంబర్ల (డబుల్)తో నమోదు చేసుకున్నారు. వీటితో పాటు నల్లా కనెక్షన్లదీ అదే పరిస్థితి నెలకొంది.

ఆన్‌లైన్ చేయడంతో..

కాగా, 2012 నుంచి మున్సిపల్ పరిధిలో క్రమేణా అన్నింటినీ ఆన్‌లైన్ చేస్తూ వస్తున్నారు. 2022–23 నుంచి సీజీజీలో ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నారు. గతంలో మాన్యువల్‌గా ఉన్నప్పుడు ఆస్తి పన్ను, నల్లా బిల్లుల్లో అవకతవకలకు ఆస్కారం ఉండేది. ఆ తర్వాత ఆన్‌లైన్‌తో అలాంటి వాటికి చెక్ పడింది. మున్సిపల్ సిబ్బంది, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే ఆస్తిపన్ను, నల్లా బిల్లులను మదింపు చేస్తున్నారు.

- 234 డబుల్ ఇంటి నంబర్లు ఉన్నట్లు గుర్తింపు
- 279 నల్లా కొళాయిలది అదే పరిస్థితి
- 17 మంది మాజీ సైనికులు, 6 ప్రభుత్వ పాఠశాలలకు ఆస్తి పన్ను మినహాయింపు
- త్వరలో విలీన గ్రామాల్లోనూ ఇంటింటి సర్వే



వందల్లో డబుల్ ఇంటి నంబర్లు

ఇక 2023–24 ఆర్థిక సంవత్సరంలో పట్టణంలోని మొత్తం 49,224 అసెస్‌మెంట్లకు గాను ఆస్తిపన్ను రూ.59,95,29,000 రావచ్చని మున్సిపల్ అధికారులు అంచనా వేశారు. అయితే ఇందులో 234 ఇంటి నంబర్లు డబుల్‌గా ఉన్నట్లు గుర్తించారు. ముందుగా ఇంటి యజమానులు తమ ఆస్తి పన్నును మాఫీ చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో మున్సిపల్ అధికారులు పరిశీలించి వీరి నుంచి రావాల్సిన రూ.2,05,38,005 మాఫీ చేశారు. అలాగే పట్టణంలో మొత్తం కొళాయి–నల్లా కనెక్షన్లు 34,894కు గాను 279 డబుల్ నంబర్లు ఉన్నట్లు గుర్తించారు. వీటికి సంబంధించిన చార్జీలను సైతం రద్దు చేశారు. ఇక సైనికులు, మాజీ సైనికులు 17 మంది, ప్రభుత్వ పాఠశాలలు ఆరింటితో పాటు అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాలు ఒక్కోదానికి ఆస్తి పన్ను నుంచి మినహాయింపు ఇచ్చారు. మరో నలుగురు సైనికులు/మాజీ సైనికులు తమ ఇళ్లను ఇతరులకు అమ్ముకోవడంతో వాటికి తిరిగి ఆస్తి పన్ను వసూలు చేయనున్నారు.

విలీన గ్రామాల్లో..

ఇదిలా ఉండగా 2012లోనే ఎనుగొండ, అప్పన్నపల్లి, ఎదిర, పాలకొండ, క్రిస్టియన్‌పల్లి, బండమీదిపల్లి, చిన్నదర్‌పల్లి, బోయపల్లి, దొడ్డలోనిపల్లి, తిమ్మసానిపల్లి గ్రామాలు మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో విలీనం కాగా ఇప్పటివరకు ఆస్తిపన్ను, నల్లా బిల్లులను సవరించేందుకు త్వరలోనే ఇంటింటి సర్వే చేయనున్నారు. ఈ గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు.

ఇది నిరంతర ప్రక్రియ

ఆస్తిపన్ను వసూళ్లలో ఏటా లక్ష్యం చేరుకునేందుకు కొన్ని నెలలు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ మా సిబ్బంది వెళ్తుంది. అదే సమయంలో ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో మార్పులు జరిగితే గుర్తిస్తాం. ఎక్కడైనా డబుల్‌గా ఉంటే యజమానుల నుంచి దరఖాస్తులు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి సవరిస్తాం. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ.

– డి.ప్రదీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ రవినాయక్, ఇతర అధికారులు

- కలెక్టర్ రవినాయక్
- జిల్లాకేంద్రంలో 5కే రన్ విజయవంతం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ రవినాయక్ పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటు వేయడం అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 5 కే రన్ నిర్వహించినట్లు తెలిపారు. శనివారం మహబూబ్‌నగర్ ప్రధాన స్టేడియం నుంచి ఐ ఓట్ ఫర్ ష్యూర్ అన్న అంశంపై ఏర్పాటు చేసిన రన్‌ను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఓటర్లు ఎన్నికల్లో ఓటు ఎలా వినియోగించుకోవాలని, ఎన్నికల్లో ఏవిధంగా పాల్గొనాలనే దానిపై విస్తృతస్థాయిలో వివరించనున్నట్లు చెప్పారు. గత ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువ ఉన్న దృష్ట్యా ఈసారి ఆయా ప్రాంతాల్లో ఓటు శాతం పెరిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొన్ని రోజులుగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సంచార వాహనాల ద్వారా ప్రత్యక్షంగా ఈవీఎంలను ఉపయోగించడం ద్వారా ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 5కే రన్‌కు పెద్ద ఎత్తున తరలివచ్చిన విజయవంతం చేసినందుకు యువత, జిల్లా అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఓటు హక్కు ప్రాధాన్యతపై పాటల ద్వారా ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్లకార్డులతో ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే నినాదాలతో జిల్లా స్టేడియం నుంచి నుంచి అశోక్ టాకీస్ చౌరస్తా వరకు వెళ్లి తిరిగి స్టేడియం వరకు చేరుకున్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ యాదయ్య, సమాచార శాఖ ఏడీ యు.వెంకటేశ్వర్లు, డీఎస్పీ మహేష్, అధికారులు భాస్కర్, డీటీలు సునీల్, రాజ్‌గోపాల్, ఆర్ఐలు చైతన్య, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో గద్దర్ చిరస్థాయిగా నిలిచారు

- ప్రొఫెసర్ హరగోపాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజల పాటగా గద్దర్ చిరస్థాయిగా నిలిచిపోతారని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ప్రజాగాయకుడు గద్దర్, ప్రముఖ ఉర్దూ జర్నలిస్టు జహీరుద్దీన్ అలీఖాన్ సంస్మరణసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ నిరంతరం ప్రజల వైపు నిలబడ్డ కళాకారుడని కొనియాడారు. నిత్యం ప్రజల కోసం ఆలోచించేవారని అనేక సందర్భాల్లో నిరూపితమైందన్నారు. గద్దర్ ప్రజల గుండెల్లో ఎంత పదిలంగా నిలిచారో అనేది ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్న వేలాది మందే సజీవ సాక్ష్యమని అన్నారు. జహీరుద్దీన్ అలీఖాన్ ప్రజాస్వామ్య లౌకిక మేధావి అని అన్నారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొడుతున్నాయని, నియంతృత్వ పాలన కొనసాగుతుందన్నారు. ఇలాంటి సందర్భంలో గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్‌లను కోల్పోవడం తీరని లోటు అని



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

అన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలను, లౌకిక ప్రజాస్వామిక సంస్కృతిని ముందుకు తీసుకుపోవడమే గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్‌లకు ఇచ్చే నిజమైన నివాళులు అని అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, ఎంఆర్ జేఏసీ కన్వీనర్ హనీఫ్ అహ్మద్, చైతన్య మహిళా సంఘం నాయకురాలు శ్రీదేవి, డి.చంద్రశేఖర్, బండారి లక్ష్మయ్య, నిజాముద్దీన్, బాబర్‌షేక్, రెహమాన్‌సోఫి, షేక్ అబ్దుల్లా, వామన్‌కుమార్, ఆదిత్య, శ్రీశైలం, కేసీవెంకటేశ్, కురుమూర్తి, జనజ్వాల, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.



భక్తి పారవశ్యంలో అన్నాసాగర్

- విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవంలో దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- కార్యక్రమానికి హాజరైన మంత్రులు, ఎంపీ, ప్రజాప్రతినిధులు

– వివరాలు 8లో..

క్లుప్తంగా

తల్లి మందలించిందని విద్యార్థిని ఆత్మహత్య

పెబ్బేరు రూరల్: పాఠశాలకు వెళ్లడం లేదని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురై శుక్రవారం విద్యార్థిని చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెందింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లికి చెందిన భారతిని, వీపనగండ్ల మండలం గోవర్ధనగిరికి చెందిన రాంబాబుకు ఇచ్చి వివాహం చేశారు. వారికి కుమారుడు, కుమార్తె జన్మించిన తరువాత భర్త భార్యను వదిలేశాడు. దీంతో ఆమె పది సంవత్సరాలుగా పెబ్బేరులో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుకుంటున్న కుమార్తె నందిని పాఠశాలకు సరిగా వెళ్లకపోవడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురై పక్కనే ఉన్న బంధువుల ఇంట్లో ఎవరూలేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలియజేశారు.

మృతదేహం లభ్యం

జడ్చర్ల: పట్టణంలోని చౌడమ్మ గుట్ట సమీపంలో శనివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి(35) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. గుట్ట వద్ద రాళ్ల సమీపంలో మృతదేహం పడి ఉంది. మృతదేహం గుర్తు పట్టడానికి వీలు లేకుండా మారిపోయింది. ఒంటిపై చొక్కా లేదు. ప్యాంటు మాత్రమే ఉంది. కాగా మృతదేహం పడి ఉన్న తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుళ్లిన స్థితిలో మృతదేహం ఉండటంతో చనిపోయి మూడు నాలుగు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. ఎవరైనా హత్య చేసి ఈ ప్రాంతంలో పడవేశారా, మరే రకంగానైనా మృత్యువాత పడ్డాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్‌బాబు తెలియజేశారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం

- చికిత్స పొందుతూ డీసీఎం డ్రైవర్ మృతి

భూత్పూర్: మండలంలోని శేరిపల్లి(బి) జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి డీసీఎం, లారీని వెనుక నుంచి ఢీకొట్టగా డీసీఎం డ్రైవర్ వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ. శ్రీనివాసులు తెలియజేశారు. ఎస్‌ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల నుంచి గొర్రెల లోడ్‌తో సిద్దిపేటకు వెళ్తున్న డీసీఎం శుక్రవారం రాత్రి భూత్పూర్ మండలంలోని శేరిపల్లి(బి) జాతీయ రహదారిపై వెళ్తున్నాడు. ముందుగా వెళ్తున్న టీఎస్12 యూసీ 2207 నంబరు లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో వెనుకాల వస్తున్న డీసీఎం లారీని ఢీకొట్టింది. డీసీఎం డ్రైవర్ వెంకటేష్‌కు గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటేష్ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

పాఠశాలకు తాళం.. వరండాలోనే విద్యార్థులు



పెబ్బేరు రూరల్: పాఠశాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో తండా పాఠశాలలు అధ్వానంగా మారాయని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం వనపర్తి మండలంలోని చిమ్మగుంటపల్లి పడమటి తండా ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థులు తక్కువగా ఉన్నారని అక్కడి నుంచి ఒక ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై పంపించేశారు. ఉన్న ఒక ఉపాధ్యాయుడు కూడా శనివారం సెలవు పెట్టడంతో, సీఆర్‌పి పాఠశాలకు వెళ్లాడు. అతడితో పాఠశాల తాళాలు లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయట వరండాలో కూర్చోబెట్టి పాఠాలు చెప్పారు. కొంత సమయానికి పాఠశాల వద్దకు విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకుని పాఠశాల ఎందుకు తెరవలేదని ప్రశ్నించారు. తాళాలు లేవని సీఆర్‌పీ జవాబివ్వడంతో తల్లిదండ్రులు ఆగ్రహించారు. తాళాలు విరగొట్టి పాఠశాలను తెరిచారు. అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తండా యువకులు చిట్యాల కాంప్లెక్స్ హెచ్ఎం గణేష్‌కు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఏనుగొండ ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో శనివారం రాత్రి ఓ జీపు ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా ఇద్దరికి గాయాలు అయినట్లు సమాచారం. అయితే కారులో ఉన్న వ్యక్తులు ఎవరూ? ద్విచక్ర వాహనంపై ఉన్న వారు ఎవరూ అనే విషయంపై స్పష్టత రాలేదు. ఈ ఘటనపై రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఈ రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా ఆస్పత్రికి వెళ్లారని, ఎలాంటి ఫిర్యాదు రాలేదని వెల్లడించారు.

భక్తిపారవశ్యంలో అన్నాసాగర్

- దేవతామూర్తులు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలు
- కార్యక్రమానికి హాజరైన మంత్రులు, ఎంపీ, జెడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు
- ముఖ్య అతిథిగా దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- మూడో రోజు హోమాలు, మహాస్నానం, పూర్ణాహుతితో కార్యక్రమం ముగింపు



ఎమ్మెల్యే ఆల నివాసంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా

భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్‌లో మూడు రోజులుగా ఆంజనేయస్వామి దేవాలయం పునః ప్రతిష్ఠాపనతో పాటు దేవతామూర్తుల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలు కనుల పండువగా నిర్వహించారు. శనివారం వేదపండితులు గోపాల్ శర్మ, పవన్‌కుమార్ శర్మల ఆధ్వర్యంలో వేదమంత్రాల ఉచ్చరణల మధ్య విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడో రోజు హోమాలు, మహాస్నానం, యంత్ర ప్రతిష్ఠ, నాభీశిలా(బొడ్రాయి), కక్ష జ్వాల, మహాబలి, పూర్ణాహుతితో కార్యక్రమం ముగించారు. దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మంత్రులు శ్రీనివాస్ గౌడ్, నిరంజన్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, అబ్రహం, రాజేందర్‌రెడ్డిలను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మంజుల దంపతులు శాలువా సత్కరించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం బోనాల ఊరేగింపు సందర్భంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మంజుల దంపతులతో పాటు మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, మూడా డైరెక్టర్లు చంద్రశేఖర్‌గౌడ్, సాయిలు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు అశోక్‌గౌడ్, యాదిరెడ్డి, మాధవరెడ్డి, నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభం ప్రతిష్ఠాన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

మన్యంకొండ ‘జనసంద్రం’

- ఘనంగా శ్రావణ శనివారం పూజలు
- వైభవంగా శేషవాహన సేవ



అలంకరణలో స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం శనివారం జనసంద్రమైంది. శ్రావణమాస విశేషోత్సవాలను పురస్కరించుకుని జిల్లా నలుమూలల నుంచి భక్తులు దేవస్థానానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 7 గంటల నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని స్వామివారి సన్నిధిలో శాంతిహోమం పవిత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. దేవస్థానంలో శ్రావణమాసంలో నెలరోజుల పాటు పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మండపం వరకు ఊరేగింపుగా..

ప్రతి శనివారం రాత్రి నిర్వహించే స్వామివారి తిరుచ్చిసేవ, శ్రావణమాసం పురస్కరించుకుని శేషవాహన సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని గర్భగుడి నుంచి శోభాయమానంగా అలంకరించిన శేషవాహనంలో దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, భక్తుల హరినామస్మరణ మధ్య ఊరేగింపు ముందుకు సాగింది. శేషవాహనంలో స్వామివారు ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి ఈ పవిత్ర ఘట్టాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని మళ్లీ గర్భగుడి వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి ఈ సేవను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారితో పాటు పాలకమండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కురుమూర్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు



కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: శ్రావణ మాసం ప్రారంభం కావడంతో తమ ఇంటి ఇలవేల్పు కురుమూర్తి రాయుడికి దాసంగాలు పెట్టి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు కురుమూర్తి గుట్టకు తరలి వస్తున్నారు. శ్రావణ మాసం మొదటి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ సిబ్బంది ఆలయాన్ని శుద్ధి చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు కొండ దిగువన మట్టి కుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారు చేసి స్వామివారికి సమర్పించారు.

ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు...

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కురుమూర్తి స్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు శ్రావణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు పవిత్రోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తారు. 29న యాగమంటప అలంకరణ, సామూహిక కుంకుమార్చనలు, లక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. 30న హోమాలు దేవతా పూజలు, వచ్చే నెల 7న శ్రీకృష్ణ జయంతిని నిర్వహించనున్నారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో మరింత తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు కేవలం 3వేల క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపు ద్వారానే నీటి పంపింగ్ కొనసాగిస్తున్నారు. ఒక పంపు ద్వారా 750 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆవిరి రూపంలో 113 క్యూసెక్కులు, భీమా లిఫ్టు -1 ద్వారా 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాల్వ ద్వారా 870 క్యూసెక్కులు, కుడి కాల్వకు 738 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు, భీమా లిఫ్టు -2 కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 4,286 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.454 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు వెల్లడించారు.

శ్రీశైలంలో 859.8 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం 859.8 అడుగుల నీటి మట్టం, 105.3990 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో భూగర్భ కేంద్రంలో 1.796 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 3,302 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. పోతిరెడ్డిపాడు ద్వార 10,000, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 500, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,519, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని వదిలారు. 248 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి కల్యాణం



శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సమీపంలో శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద ఆధ్వర్యంలో విశ్వశాంతి మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యాగ మహోత్సవంలో భాగంగా శనివారం రాత్రి లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపించారు. ఉదయం నుంచి జరిగిన యాగ మహోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి సందర్శించి పూజలు చేశారు. భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఉత్సవంలో శ్రీలక్ష్మీనృసింహ సహిత సుదర్శన లక్ష్మీనారాయణ నవగ్రహ సంతాన లక్ష్మీ హోమాలు జరిపించారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

అధికారంలోకి వస్తే.. అర్హులందరికీ ఇళ్లు

ప్రజాహిత పాదయాత్రలో అనిరుధ్‌రెడ్డి



అయ్యవారిపల్లిలో పాదయాత్ర చేస్తున్న అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్: జడ్చర్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి అన్నారు. ప్రజాహిత పాదయాత్రను శనివారం అయ్యవారిపల్లి నుంచి ప్రారంభించారు. అనంతరం చిల్వేర్, కొత్తపల్లి వరకు నిర్వహించిన పాదయాత్రలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పేద ప్రజలకు మేలు కంటే కీడు ఎక్కువైందని అన్నారు. మండలంలో ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వలేదని, ఇప్పుడు ఇస్తున్న రుణమాఫీ కూడా బ్యాంకులో వడ్డీలకే సరిపోతుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రూ.500 కే గ్యాస్ సిలిండర్, నిరుద్యోగ భృతి, అందజేస్తామన్నారు. ప్రజలు బీఆర్ఎస్ మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ప్రజల అవస్థలు చూసి సోనియా గాంధీ ప్రత్యేక తెలంగాణ ఇస్తే, రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం తప్ప మరెవరూ లబ్ధి పొందలేదని అన్నారు. ఒక్కసారి తనకు అవకాశం ఇస్తే జడ్చర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి కొబ్బరికాయలు కొట్టడం తప్ప పనులు పూర్తి చేయడం తెలియదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రబ్బానీ, అల్వాల్‌రెడ్డి, సంపత్, మల్లికార్జున్‌రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్‌లో గుప్తనిధుల తవ్వకాలు



గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన ప్రదేశం

ఆత్మకూర్: గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన ఘటన ఆత్మకూర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ సమీపంలోని మషమ్మ ఆలయం సమీపంలో నాగదేవతల విగ్రహాలు ఉన్న పుట్టలో తవ్వకాలు జరిపినట్లు శనివారం భక్తులు గుర్తించారు. దీంతో వారు కౌన్సిలర్ అశ్విన్‌కుమార్, ఎస్ఐ నరేందర్‌కు సమాచారం ఇచ్చారు. నాగదేవతల విగ్రహాలను పక్కనబెట్టి పుట్టను ధ్వంసం చేసి నాలుగు అడుగుల మేర తవ్వకాలు జరిపినట్లు నిర్ధారించారు. గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన దుండగులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలియజేశారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

జడ్చర్ల: మతిస్థిమితం సరిగా లేక ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు ఎడ్ల రంగయ్య(62) వ్యవసాయ బావిలో శవమై తేలిన సంఘటన జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గొల్లపల్లికి చెందిన రంగయ్యకు మతిస్థిమితం సరిగా ఉండేది కాదు. ఈ క్రమంలో ఈ నెల 14న ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుమారుడు కుమార్ ఈ నెల 17న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో మండల పరిధిలోని లింగంపేట గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహం ఉందన్న సమాచారంతో అక్కడికి వెళ్లి పోలీసులు పరిశీలించారు. తమ స్టేషన్‌లో నమోదయిన మిస్సింగ్ కేసుకు సంబంధించి ఎడ్ల రంగయ్యగా మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

తప్పిన పెను ప్రమాదం

వంతెనను ఢీకొట్టిన వాహనం



కందూర్ స్టేజీ వద్ద పెద్దవాగు రక్షణ గోడపై నిలిచిపోయిన వాహనం

అడ్డాకుల: జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన మరో వాహనం ఢీకొట్టింది. దీంతో ముందున్న వాహనం వాగు బ్రిడ్జి రక్షణ గోడను ఢీకొట్టి లోపలికి పడేలా వేలాడుతుంది. దీంతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది. ఈ సంఘటన అడ్డాకుల మండలం కందూర్ స్టేజీ సమీపంలో పెద్దవాగు వద్ద చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాకు చెందిన జగదీష్ బీరకాయలను మహీంద్రా క్యాంపర్ వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో కందూర్ స్టేజీ దాటిన తర్వాత పెద్దవాగు బ్రిడ్జీ వద్ద క్యాంపర్‌ను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో క్యాంపర్ అదుపు తప్పి రెండు బ్రిడ్జీల మధ్యన ఉన్న వాగు రక్షణ గోడవైపు దూసుకెళ్లి గోడను ఢీకొట్టి దానిపైనే ఆగిపోయింది. మరికొంత ముందుకు వెళ్తే వాగులోకి పల్టీ కొట్టేది. గోడపైనే నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది. వాహనంలోని డ్రైవర్ జగదీష్ ఎలాంటి గాయాలు కాకుండా ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. వాహనం వాగులోకి పల్టీ కొడితే ఊహించని నష్టం వాటిల్లేది. ఉదయం ఎల్అండ్‌టీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని రక్షణ గోడపై నిలిచిపోయిన క్యాంపర్‌ను క్రేన్, ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీశారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

వీధికుక్కల స్వైరవిహారం

వేర్వేరు చోట్ల ఓ వ్యక్తి, ఇద్దరు మహిళలు, మేక, గొర్రెపిల్లలపై దాడి



సుద్దకల్‌లో కుక్కల దాడిలో చనిపోయిన మేక పిల్లలు



కోయిల్‌కొండలో గాయపడిన మహిళ

హన్వాడ: హన్వాడ మండల పరిధిలోని పుల్పోనిపల్లిలో లక్ష్మీబాయి ఇంటికి సమీపంలోని కిరాణ దుకాణానికి వెళ్లింది. ఈ క్రమంలో అటువైపుగా వచ్చిన పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసింది. అక్కడే ఉన్న వారు దానిపై తిరగబడటంతో అటు నుంచి పారిపోయింది. మరో వీధిలో ఉండే తెలుగు వెంకటయ్య ఇంట్లోకి చొరబడి అతడిని తీవ్రంగా గాయపరిచింది. ఇంట్లోంచి వస్తున్న అరుపులు విని స్థానికులు వెంటనే కుక్కపై దాడి చేసి అతడిని రక్షించారు. అటు నుంచి పారిపోయిన కుక్క గ్రామశివారులోని గొల్లవెంకటయ్య మేకపోతుపై దాడి చేసింది. దీంతో ఒక్కసారిగా పదుల సంఖ్యలో తరలివచ్చిన గ్రామస్తులు కర్రలతో దాడి చేసి కుక్కను హతమార్చారు. గ్రామాల్లో వీధికుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిందని, వాటి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మహిళపై కుక్కల దాడి

కోయిల్‌కొండ: మండల కేంద్రానికి చెందిన బాలమణి వరినాట్లు వేసేందుకు కూలీ పనికి వెళ్లగా అక్కడ ఉన్న కుక్క ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో చుట్టుపక్కల వారు ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

18 గొర్రెపిల్లలు మృత్యువాత

కోడేరు: వనపర్తి జిల్లా చిన్నబావి మండలం మియ్యాపూర్‌కు చెందిన గోపాల్‌దిన్నె వీరయ్య గొర్రెల మందను వారం రోజుల కిందట కోడేరు మండలానికి మేతలకు తీసుకొచ్చారు. రోజు వారీగా పస్పుల శివారులో ఓ వ్యవసాయ పొలం చెట్టుకింద ఇనుప కంచెలో 20 గొర్రె పిల్లలను ఉంచి గొర్రెల మందను మేతకు తీసుకెళ్లారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో కుక్కలు అందులోకి దూరి 18 గొర్రె పిల్లలపై దాడి చంపేశాయి. రెండు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి.

మరో 9 మేక పిల్లలు, గొర్రె పిల్ల మృతి

కల్వకుర్తి రూరల్: మండల పరిధిలోని సుద్దకల్‌కి చెందిన గుండాల నర్సయ్యకు చెందిన 9 మేక పిల్లలు, ఒక గొర్రె పిల్లపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. దీని విలువ సుమారుగా రూ.50 వేల వరకు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలయంలో చోరీ: నిందితుడి అరెస్ట్

బిజినేపల్లి: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం అర్ధరాత్రి హుండీ చోరీకి గురైంది. దీంతో ఆలయ కార్యదర్శి కావలి నిరంజన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ రాములు యాదవ్ విచారణ చేపట్టారు. సల్కర్‌పేటకి చెందిన బాలయ్య ఆలయంలో హుండీని పగలగొట్టి అందులోని నగదును చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
■ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బెంగళూరు హైవే తిమ్మాపూర్, కొత్తూరు, నందిగామ ఐక్యమధ్యలో HMDA వెంచర్‌లో కే॥ 15 లక్షలకే ప్లాట్ సొంతం లోన్ సౌకర్యం కలదు.(ఏజెంట్లు కావలెను) 9052254789.

SERVICES

BUSINESS OFFER
■ స్త్రీ/పురుషులు, చిన్న పెట్టుబడితో ప్రతినెల 25000/- ఫిక్స్‌డ్ వేతనంతో పాటు మీకు నచ్చిన ఆదాయం పొందండి. ఫోన్ : 7386425653, 7416087357

HEALTH CARE
ORTHOPEDIC SURGEON
■ డా॥యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, శివ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 - 228666, 83412 98666

WANTED
■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376.
■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520.
■ ఇంట్లో ఉండి వంట చేయుటకు ఏ బాదరబంది లేని 45 సం॥లోపు ఒంటరి స్త్రీ కావలెను. జీతం+ వసతి కలదు. సంప్ర: ఫోన్ : 9398026202
■ గ్రాడ్యుయేషన్ చదువుకున్న లైసెన్ ఆఫీసర్స్ మరియు కన్‌స్ట్రక్షన్, వ్యవసాయం లో అనుభవం ఉన్న సీనియర్ సూపర్ వైజర్ కావలెను. PVC ప్రాజెక్ట్స్. Call Mon-Sat 11am-5pm on 040-23338080, 8686417794
■ Now Hiring Sales Staff, SRI Mahalaxmi Jewellers & Pearls, Jubilee Hills, Hyderabad. Join our Prestigious group for growth. Male Candidates only. Execullent pay. Ph: 9000703311, 9100112221, 9441436385.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50
5% GST అదనం మాత్రమే
వివరాలకు :
మహబూబ్‌నగర్ : 9010234478, 9010522215, 9705135557, 9010869797
జడ్చర్ల : 9010076222
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9010068317
గద్వాల : 9553955603
నారాయణపేట : 9010962007

సాక్షి భవిత విద్యార్థుల కోసం

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి
HAPPY BIRTHDAY
కేవలం రూ. 500/- మాత్రమే

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే రేటు క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజ్‌మెంట్